నా రాకకి బావగారింట్లో అంతా ఎంతో సంతోషించారు. "ఏమిత్రా ! అలా చిక్కిపోయావ్." అంది అక్క ఆప్యాయంగా,

# గరళం

పమ్మి వీరభద్రరావు

"ఏరా నవాబూ! దిగావా? నీకోసం రెండు రోజులుగా ఎదురు చూస్తున్నాను ఇంకా ఎక్కడి పనులక్కడే వుండి పోయాయి." అన్నారు బావగారు.

"ఏం బావా! ఇప్పుడా రావడం-నీకేం కాశాను?" అంది బావగారి చెల్లెలు పాప.

ఆ హాల్లో వున్న వాళ్ళంతా నన్ను ఏదో రకంగా పలకరించారు ఆ అమ్మాయి తప్ప..

ఆమె ఎవరో నాకు తెలియదు ఎర్రగా, సన్నగా, నాజూకుగా వుంది. లంగా వోణి, వంకీలు తిరిగిన జుట్టు...

అందంగా కనబడుతుంది. అలా కనిపించాలనే తపన ఎక్కువ కనిపిస్తోంది- ఆమెకు పదహారేళ్ళుంటాయి. ఆమె పాప పక్కన కూర్చుని నన్నే తదేకంగా చూస్తోంది. నేను తనకేసి చూసినప్పుడల్లా దొరికిపోవడం ఇష్టంలేక ఎటో చూస్తోంది.



''హని రాలేదా'' అనడిగాను అక్కని - హనుమంతు మా బావగారి తమ్ముడు. గుంటూరులో ఎం. ఏ చదువుతున్నాడు. మేం ఇద్దరం మంచి స్నేహితులం.

''వచ్చాడురా-.వచ్చినప్పట్నుంచి నిన్నే తల్చుకుంటున్నాడు. ఏవో సరుకులు కొనడానికి తణుకు వెళ్ళాడు. అంది అక్క''

నేనక్కడే కూర్చుని అక్కతో కబుర్లు చెప్తున్నాను.

ఆ అమ్మాయి మాత్రం నాకేసి చూస్తోంది.

పాప పెళ్ళి కుదిరిందని వారంరోజులు ముందుగా రమ్మనమని బావగారు రాసిన ఉత్తరమూ. ఫలానారోజు నా పెళ్ళి-(మంచి ప్రజెంటేషన్ పట్టుకుని) పదిహేను రోజులు ముందుగా రావాలి-అని పాప రాసిన ఉత్తరమూ అందుకుని పెళ్ళికి నాల్గు రోజులు ముందుగా నేను ''మా బావగారూరు'' అనబడే ఆ గ్రామానికి వెళ్ళాను.

నేను వెళ్ళినరోజు సాయంత్రమే ''ఆ అమ్మాయిని'' పుష్పగా నాకు పాప పరిచయం చేసింది.

పుష్ప వాళ్ళ నాన్నగారు ఆ వూరి పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ట్రాన్స్ఫరై వచ్చారు. బావగారి వీధిలోనే వుంటున్నారు వాళ్ళు. ఆమె ఆ వూరి హైస్కూల్లో పదో తరగతి చదువుకుంటోంది.

పాప ఏవేవో కబుర్లు చెప్తోంది. నేను మంచంమీద కూర్చుని శ్రద్ధగా వింటున్నాను. పుష్పమాత్రం నాకేసే చూస్తోంది.

ఆమె ధోరణి నాకొంచెం వింతగా అనిపించింది.

పుష్పకు ఫాషన్లంటే ఎక్కువ ఇష్టమనిపిస్తుంది. మాటిమాటికి నుదుటిమీద పడ్డ జుట్టుని అటూ ఇటూ సర్దుకుంటుంది. ఆమెతో అసలు మాట్లాడకపోతే బాగుండదని ఆమె కుటుంబ విషయాలు, వాళ్ళ స్కూలు విషయాలు కాస్సేపు మాట్లాడాను. చాలా చనువుగా మాట్లాడుతుందామె.

మర్నాడు సాయంత్ర నేనూ, హనుమంతు కాలవగట్టున కూర్చుని పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకున్నాం, ఇంటికెళ్ళేసరికి బాగా చీకటిపడింది. పాప మా కోసం భోజనం చెయ్యకుండా ఎదురు చూస్తోంది. భోజనాలు పూర్తయ్యాక పాప నా దగ్గర కొచ్చి సెకండ్‌షో సినిమా కెళ్దాం బావా! నువ్వొస్తే అన్నయ్య వెళ్ళనిస్తాడు'' అంది.

అక్కడున్న టూరింగ్ టాకీస్‌కి సినిమా కెళ్ళాం. హాల్లో నాకు చెరో ప్రక్కన పుష్పం పాప కూర్చున్నారు. పాప పక్కన హనుమంతు కూర్చున్నాడు. సినిమా జరుగుతుండగా నా చేయి తన చేతుల్లోకి తీసుకుంది పుష్ప, నేను చెయ్యి తీసేసుకున్నాను. తన భుజం నాకు రాస్తూ కూర్చుంది. కావాలనే తను అలా చేస్తోందనిపించింది. ఇంటర్వెల్‌లో బైటికెళ్ళి టీ తాగొచ్చాం నేనూ హనుమంతు తిరిగి లోపలి కొచ్చాక నేను పాపకి హనుమంతుకి మధ్యలో కూర్చున్నాను. పుష్పముఖం చిన్నబోయింది. అయినా మధ్య మధ్య పాప మీదుగా ఒదిగి నా చెయ్యి పట్టుకుని ఏదో చెప్తూనే ఉంది.

ఆమె ఎందుకలా ప్రవర్తిస్తోంది?

ఎక్కువ చనువు తీసుకోవడం ఆమె అలవాటా?...లేక ఆమె ప్రవర్తన వెనకాల ఏదైనా అర్థం వుందా?

మర్నాడు సాయంత్రం హనుమంతు పనిమీద పొరుగూరి కెళ్ళాడు. వాడు లేకపోతే ఆ వూళ్ళో నాకేమీ తోచదు. మేడమీద గదిలో మంచంమీద పడుకుని పుస్తకం

చదువుకుంటున్నాను. పుష్ప అక్కడికి వచ్చింది. ఆ వూళ్ళో తనకేం తోచడంలేదట. అంతక్రితం వాళ్ళున్న వూళ్ళో చక్కగా కాలక్షేపమయ్యేదట. ఆమె కబుర్లు వింటూ నేనెటో చూస్తున్నాను. కుర్చీలో కూర్చున్న దల్లా చటుక్కున దగ్గరకొచ్చి నా మెడ చుట్టూ చేతులేసి నా ముఖాన్ని తన ముఖానికి దగ్గరగా లాక్కుంది. నేనామె చేతులు విడిపించుకుని దూరంగా జరిగాను.

"చూడు పుష్పా! నువ్వలా ప్రవర్తించ కూడదు. ఎవరైనా చూస్తే బాగుండదు."

"ఎవరూ చూడకపోతే ఫరవాలేదా?" అంది ఠక్కున.

అది అమాయకత్వమో, అతి తెలివో నాకర్థం కాలేదు. పెళ్ళి పనుల హడావుడి ఎక్కువయింది. చుట్టాలు ఒక్కరొక్కరే దిగుతున్నారు. పనుల హడావుడిలో నేనెక్కడ వుంటే పుష్ప అక్కడే వుండేది. నేనే పని చేస్తున్నా తను వచ్చి నా చేతిలో పని అందుకునేది. అస్తమానం కాఫీ తీసుకొచ్చి ఇస్తుండేది. కావాలని నన్ను రాసుకుని పూసుకుని తిరిగేది. సాధ్యమైనంతవరకు నన్ను ఒదిలి ఉండేది కాదు. ఆమె మన స్తత్వం నాకు అంతుబట్టలేదు ఆమె ఎందుకలా ప్రవర్తిస్తోందో నాకర్థం కాలేదు.

ఒకవేళ ఆమె నన్ను కోరుతుందేమో!

ఆ రోజు ఉదయం పాప పెళ్ళి బ్రహ్మాండంగా జరిగిపోయింది. ఏర్పాట్లు చక్కగా చేశాం. ఆ రాత్రి శోభనం జరిగింది. ఆడాళ్ళంతా చేరి ఎంతో అల్లరి చేశారు. పాపను పుష్ప మరీ ఆట పట్టించింది,

ఇల్లంతా చుట్టాలు. పడుకుందామంటే ఎక్కడా ఖాళీ లేదు. అతి కష్టం మీద ఓ పరుపు సంపాదించి మేడ మీద వెన్నెల్లో వేసుకున్నాను. పగలంతా బాగా అలసి ఉండటంవల్ల పడుకోగానే నిద్ర పట్టేసింది. కొంతసేపు పోయాక ఎవరో నన్ను తట్టి లేపుతున్నట్టనిపించింది. మెళకువ వచ్చి చూసేసరికి పుష్ప కూర్చుని వుంది. వెన్నెల్లో ఆమె ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ముఖంలో ఓ రకమైన భయం ఆత్రుత పోటీ పడుతున్నాయి. అయినా ఆమె నిశ్చలంగా చూస్తోంది.

"పుష్పా! ఇంత రాత్రి వేళ ఎందుకొచ్చావ్?" కాస్త మందలింపుగానే అన్నాను.

"ఎవరూ చూడలేదు. అంతా నిద్రపోయారు." నిర్మలంగా చెప్పింది. ఆమె సమాధానానికి నాకు నవ్వొచ్చింది.

"అసలెందుకొచ్చావిక్కడికి?" కాస్త కోపంగానే అన్నాను.

"వయసులో ఉన్న ఆడపిల్ల వయసులో ఉన్న మగాడి దగ్గరికి ఇంత వెన్నెల్లో ఎందుకొస్తుంది?" - శూన్యంలోకి చూస్తూ అంది. ఆమె అంత నిర్భీతిగా చెప్పేసరికి నేను కొంచెం ఆశ్చర్యపోయాను నేను పరుపు మీద కూర్చుని అగ్గిపుల్ల గీసి సిగరెట్ వెలిగించుకున్నాను. ఆ వెలుతురులో ఆమె ముఖం మరీ స్పష్టంగా కనిపించింది. ఆ కళ్ళనిండా కోర్కె అలుముకుంది. ఆమె ముఖం ఎర్రగా వుంది. కాసేపు ఇద్దరం మాట్లాడలేదు. ఆమెకు ఎలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు.

"పుష్పా! నీ కెన్నేళ్ళు!" మౌనాన్ని చంపుతూ అడిగాను.

"పదహారు!"

"పోనీ మీ నాన్నగారితో చెప్పి పెళ్ళి చేసుకోరాదు?"

"మరో నాల్గేళ్ళదాకా చెయ్యరట. అమ్మ ఎవరితోనో చెప్తుంటే విన్నాను" అంది.

పుష్ప అంత చిన్న వయసులోనే అంత పెద్ద కోర్కెలు ఎందుకు పెంచుకుందో అర్థం కాలేదు. ఆమె మన సత్వాన్ని ఎవడేనా ఆసరాగా తీసుకుంటే ఆమె జీవితం నాశనమౌతుంది. వాళ్ళ కుటుంబం నవ్వులపాలౌతుంది. ఆమె జీవితాన్ని చాలా తేలికగా తీసుకుంటోంది. భవిష్యత్తు గురించి ఆమె ఆలోచించడం లేదు. ఎదగని మనస్తత్వంలో ఎదిగీ ఎదగని వయస్సులో ఎదిగిపోయిన కోర్కెలున్న ఆమె భవిష్యత్తు ఎలా వుంటుందో ఊహించేసరికి నాకు భయం వేసింది.

ఈ విషయాలన్నీ ఆమెకు ఓపిగ్గా, నేర్పుగా చెప్పడానికి ప్రయత్నించాను. అన్నీ విన్నాక.

"నన్ను పెళ్ళి చేసుకొమ్మని నేనడగడం లేదుగా - ఈ ఒక్కసారి కాదనకండి ప్లీజ్ మనవిషయం ఎవ్వరికీ తెలియనివ్వను" అని నా ముఖంలోకి ఆశగా చూసింది.

"పుష్పా! నువ్విక్కణ్ణుంచి వెళ్ళిపో" సౌమ్యంగానే అన్నాను.

"ప్లీజ్ ... ఈ ఒక్కసారి కాదనకండి ఐ లవ్ యూ" అంటూ మెడ చుట్టూ చేతులు వేసి, పిచ్చిదానిలా ప్రవర్తిస్తోంది.

"పుష్పా! నువ్వెళ్ళిపోతావా? లేదా?" చాలా సీరియస్‌గా అడిగాను తోక తొక్కిన తాచులా నిలబడింది. ఆ క్షణంలో ఆమె కోపాన్ని చూస్తే నాకొక్క క్షణం భయం వేసింది ముఖం నిండా అవమానం, బాధ, కోపం, కోర్కె మిళితమయ్యాయి. ఆమె గుండెలు ఎగిసిపడుతున్నాయి. ఆమె కోపంగా అన్న మాటలు నాకు ఆమె మీద జాలిని కలగ చేశాయి నేనా వూళ్ళో వున్న రెండు రోజులు నాకగ్గనబడకుండా తిరిగింది. తాత్కాలికంగా ఆమె నా మీద కోప్పడ్డా తర్వాతైనా మెల్లగా ఆమె నా మంచితనం గ్రహిస్తుందనే నమ్మకం మిగిలిపోయింది.

జరిగిన విషయమంతా హనుమంతుకి చెప్పాను.


మీ కుటుంబంలోని యావన్మందినీ
ఆలోచింప చేసే
ప్రజాతంత్ర
ప్రతివారం చదవండి

కొన్ని నెలల తరువాత ఆఫీసు పనిమీద గుంటూరు వెళ్ళాను. హనుమంతు రూంలోనే మకాం. మాటల సందర్భంలో పుష్ప గురించి అడిగాను.

"ఇక్కడే హాస్పిటల్ లో వుంది." అన్నాడు. నాకర్థంకా లేదు. వాళ్ళూళ్లో శాస్త్రి అనే ఓ కుర్రాడున్నాడు. అతను చదువు సంధ్య లేమీ లేకుండా జులాయిలా తిరుగుతుంటాడు. పుష్పకు అతనితో పరిచయం అయింది. వాళ్ళు రోజూ కలుసుకుంటు వుండే వారు. పుష్ప అతనితో సంబంధం పెట్టుకుంది. వాళ్ళ వ్యవహారం కొన్నాళ్ళు రహస్యంగానే వుండిపోయింది. తర్వాత్త ర్వాత బైటికి పొక్కింది. పుష్ప తల్లిదండ్రులు ఆమె కెన్నో కట్టుబాట్లు పెట్టారు. అయినా లాభం లేకపోయింది రోజూ ఆమె అతన్ని ఏదో రకంగా కల్సుకుంటూండేది. శాస్త్రి రోగాల పుట్ట.

పుష్ప తన వ్యవహారాన్ని రహస్యంగా దాచుకున్నట్టే తనకు సంక్రమించిన అనారోగ్యాన్ని కూడా రహస్యంగా దాచుకుంది. తర్వాత విషయం తెలిసి ఆమెను గుంటూరు హాస్పిటల్లో చేర్పించారు.

అంతా విన్నాక పుష్పమీద నాకు జాలేసింది. నేనూ హనూ వెళ్ళి ఆమెను చూశాం. ఆమె నా స్థితిలో చూడాల్సి వచ్చినందుకు నేను చాలా బాధపడ్డాను. ఆమె ముఖమంతా కురుపులతో రసి కారుతూ అసహ్యంగా వుంది. ఆమె ముఖం చీడ పట్టిన మల్లెపువ్వులా వుంది. చక్రాల్లా తిరిగే ఆమె కళ్ళు ఎండిపోయి కాసేపట్లో రాలిపోయే ఆకుల్లాగా వున్నాయి ఆమె బెడ్ మీద నిర్జీవంగా పడుకుని వుంది. మమ్మల్నిచూసి తల పక్కకి తిప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అక్కడ నిలబడలేక బైటికి వచ్చేశాం.

"ఎంత అందమైన జీవితాన్ని నాశనం చేసుకున్నావమ్మా" అనుకున్నాను మెట్లు దిగుతూ—

ఆ రోజంతా నాకు పుష్ప మనస్సులోనే మెదిలింది. ఆమె చిన్న వయసులోనే పెద్దకోర్కెలు పెంచుకుంది. అవి రాజుకుంటున్న సమయంలో నన్ను చల్లార్చమని కోరింది, వేడుకుంది, బ్రతిమాలింది. కాని నేను ఆమెకు సంఘం గురించి, కట్టుబాట్ల గురించి, జీవితం గురించీ చెప్పాను. తన జీవితం నాశనం చేసుకోద్దని హితవు చెప్పాను.

తన కోర్కె తీర్చకుండా ఈ "అమ్మమ్మ కథలు" చెప్పినందుకు ఆమెకు నామీద కోపం వచ్చింది.

'ఆడపిల్ల తనంత తానుగా వలచివస్తే సుఖపడలేని వాజమ్మవి. వెన్నెలకు అర్థం తెలియని వెధవ్వి, నువ్వేం మగాడివి' అని క్రూడ్‌గా అనకపోయినా అలాటి అర్థంవచ్చే మాటలే ఎన్నోఅంది.

అయినా నేను బాధ పడలేదు. ఆమె మాటల్ని చాలెంజీగా తీసుకోలేదు. "అవకాశం వచ్చినా నేను ఓ ఆడపిల్లని పాడు చేయలేదు. నేను దుర్బలుణ్ని కాదు. నామీద నాకు కంట్రోల్ ఉంది" అనిగర్వపడ్డాను.

కాని చివరికి జరిగిందేమిటి?

మనిషికి ఆకలి వేసినప్పుడు మంచి భోజనం తిని సంతృప్తి పడాలనుకుంటాడు.

ఆ కోర్కె తీరకపోతే అదే ఆకలి బాధగా మారుతుంది. ఆ సమయంలో మంచి భోజనం తిని తృప్తిపడాలనే కోర్కె కన్నా ఆకలనే బాధను పోగొట్టుకోవాలన్న తపన ఎక్కువవుతుంది.

పుష్పను నేను తిరస్కరించాక ఆమెలో కోర్కెలు మంటలయ్యాయి. శాస్త్రి ఆమె మానసిక పరిస్థితిని ఆసరాచేసుకొని ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. నాకు చిన్నప్పటి సంఘటన గుర్తుకొచ్చింది.

మా ఇంటికి దగ్గర్లో ఓ కుటుంబం వుండేది. వాళ్ళల్లో ఒకతనికి జబ్బుచేసింది. వారం రోజులపాటు అతను చావుబతుల్లో కొట్టుకున్నాడు. ఎంతోమంచి డాక్టర్లను పిలిపించి ఎన్నో రకాల వైద్యాలు చేయించారు. కాని లాభంలేక పోయింది. అతను బతకడని డాక్టర్లు తేల్చి చెప్పారు. ఆఖరి ఆశగా అతనికి ఆ ఇంట్లోవాళ్ళు గరళం పోశారు. గరళం విషమని అది తాగిన వాళ్ళు చచ్చి పోతారని వాళ్ళకి తెలుసు. అదే పని చేసి అతను బతికితే —అందరూ సంతోషిస్తారు. అతను చనిపోతే—డాక్టర్లు ముందే తేల్చి చెప్పారు కాబట్టి అది వినడానికి వాళ్ళంతా సిద్ధంగానే వున్నారు. కాని—వాళ్ళుతీసుకున్న రిస్క్ ఫలించింది.

అతను బతికాడు—

నేను ఆనాడు పుష్ప కోర్కెలను మన్నిస్తే—ఆమెకు ఆ అనుభవం అందిస్తే ఆమె జీవితం ఇలా అయ్యుండేది కాదేమో అనుకున్నప్పుడు మాత్రం చాలా గిల్టీగా ఫీలయ్యాను.

## వచ్చేవారం

- స్టాంపులు సేకరించడమంటే ? (ఈవారం విశేష రచన) — అనుపమ
- గడియారం (కథ) —వి. రాజారామమోహనరావు
- సహనానికి సరిహద్దులు (కథ) —కె. కె. మీనన్
- పతివ్రత (కథ) —సింహప్రసాద్
- సామాన్యుడి ఐస్‌క్రీమ్, పుచ్చకాయ ! — శంభు
- అనంతం • సావేరి • రాజు_పేద
- సినీతంత్ర • సమాజానందస్వామి,

ఇంకా ఇతర ఆకర్షణలు